ఓం నమః శివాయ

శుభమస్తు | అవిఘ్నమస్తు



శ్రీ ఆదిశంకరాచార్య విరచిత

# శ్రీ దక్షిణామూర్తి స్తవము

## సంస్కృత శ్లోకములకు తెలుగుపద్య భావార్ధ వ్యాఖ్యానం

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



## ముందుమాట

హిందూమతం ఈనాటిది కాదు. ఏనాటిదో ఇదమిద్ధంగా ఎవరికీ తెలియదు. మానవుల ఆత్మజ్ఞానానికి ఆలవాలమైన ఈ వృక్షం కేవలం కట్టెల కోసం నరకబడి నేడు గాలివచ్చినా పడిపోయే దశకి వచ్చింది.

ఈ జ్ఞానం అగ్రకులాల సొత్తనే భ్రమతో తలా ఒక కొమ్మ నరికి వేశారు. ఈ జ్ఞానానికి మతం రంగు ఏ స్వార్ధ పరుడు వేశాడో కాని ఇది కళా విహీనమయిపోయింది.

ఎన్నో మతాలు ఈ వృక్షం పాదుల్లో నీరు బదులు నూనె పోశాయి, పోస్తున్నాయి. అయినా ఇది నిర్మూలం కాలేదు. కాదుకూడా. కారణం ఇది ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఏ కులస్థుడి సొత్తూ కాదు. ఏ మతస్థుడి సొత్తూ కాదు. అందరూ ఒకేలా పుడ్తారు. ఒకేలా చస్తారు. కానీ ఒకేలా జీవించరు. ఒకే తల్లి దండ్రికి పుట్టిన ఇద్దరు ఒకేలా పెరగరు. పెరిగినా ఒకేలా చదవరు. చదివినా ఒకే స్థితిలో ఉండరు. ఉన్నా ఒకేలా సుఖించరు. సుఖించినా ఒకేలా కీర్తి (అపకీర్తి కూడా) పొందరు. ఆఖరికి ఒకేలా చావరు. (మరణ యాతన)



ఎందుకని? ఎందుకని? ఎందుకని? దీనికి సమాధానం చెప్పలేకే కర్మ సిద్ధాంతం ఆమోదించబడింది. ఆదిశంకరులు 12 వందల సంవత్సరాల క్రితం పుట్టి వాడి నశించిపోతున్న ఈ ఒకనాటి మహావృక్షానికి (హైందవ ధర్మం) కాపు కాశారు. ఆ ప్రయత్నంలో ఎన్నో రచనలు చేశారు. ఆ రచనల్లో ఒక మణి ఈ దక్షిణామూర్తి స్తవం. ఈ జ్ఞానం మనందరిదీ. మానవులందరిది. ఆయన ఏ ఒక్కరికీ ఇవ్వలేదు.

ఆ జ్ఞానం పొందండి నాయనా అంటే అజ్ఞానంతో మనం చేస్తున్నదేమిటి? ఎక్కడికి పోతున్నాం? నీకు నేను ఉరి వేసి నీవే ఉరిపోసుకున్నావని నమ్మిస్తాను. నీ ఖాతాలో నేను డబ్బువేసి నువ్వే దొంగవంటాను. పడుపుకత్తె ఇల్లాలిని కులట అంటున్నది. మార్కులేయించుకుని మహా పురుషుడైతే అదేం తప్పా అంటున్నారు. ఉద్యోగాలూ పదవులూ రావటం లేదు. తెచ్చు"కొంటు"న్నారు.

ఈ విధానంలో మనిషిని బాధిస్తున్నది ఎవరు? వాడి అంతరాత్మే. ఈ చెడ్డ మనిషిలో ఉన్న ఆ దేవుడే అంతరాత్మ. వాడు చెడ్డవాడు కాదు. మేలిమి బంగారం. చెడ్డవాడు అరిషడ్వర్గాలకు లొంగిన ఈ మనిషే. మట్టి కొట్టుకు పోయిన



ఈ వజ్రాన్ని కడిగి సమున్నత స్థానం ఇచ్చి మనిషి భ్రమ తొలగింప చేయుటయే ఆదిశంకరుల ఉద్దేశ్యం. మానవాళి శాంతి సంతోషాలతో ఉండడమే ఆ పరమాత్మ ఉద్దేశ్యం. ఆ శాంతికి భంగం కలిగిస్తే ఆయన శిక్షిస్తాడు. అది శిక్ష అనికూడా తెలియకుండానే మనిషి కన్నీరు కారుస్తాడు. ఆ శాంతిని పెంపుచేసేవారికి సంతోషం కలుగ చేస్తాడు. అదే పుణ్యం. ఆదిశంకర మఠాధిపతులైనా ఆయన శిక్ష తప్పించుకోలేరు.

శ్రీ దక్షిణామూర్తి అయిన ఆ పరమశివుడు ఒకసారి ఆ శనిని కోరి మరీ పట్టుకునేట్లు చేసి ఒకరోజంతా దుర్గంధ భూయిష్టమైన బావిలో గడిపాడు. మనం ఎంత? సరే ఈ దక్షిణామూర్తి స్తవము ఎంతో ప్రసిద్ధి చెందిన స్తోత్ర మాణిక్యం. కేవలం పది శ్లోకాల్లో వేదాంతం అంతా జొప్పించి మనం మన గురించి తెలుసుకునేలా చేసే ఈ దివ్య స్తోత్రాన్ని పద్యాల్లో వ్రాయాలనే తపనే నాచేత ఈ సాహసం చేయించింది. ఎవ్వరైనా ఆదిశంకరులు అనే మహా సముద్రం ముందు పిల్ల కాలువలే. ఒకరు చిన్న, మరి ఒకరు మరీ చిన్న అంతే. నాకు ఆ గురుమూర్తి ఇచ్చిన అగమ్య శక్తితో నేను వ్రాసాను. ఇందలి భావం కొండొకచో

తేడా వుంటే క్షంతవ్యుడను. బాదామి జయరామ గుప్తాగారి రచన ఆధారంగా నేను ప్రత్యేక వివరణ వ్రాయగలిగాను. వారికి నేను కృతజ్ఞతా పాదాభివందనం చేస్తున్నాను.

మరొక్కమాట శరీరం అనిత్యం, జీవితం బుద్బుదప్రాయం అని వేదాంతం వల్లిస్తూ బాధ్యతలు తప్పించుకోకండి. అవి తీరాకే ఈ వేదాంతం. కానీ నువ్వు నిత్యం అనుకుంటున్నది నిత్యం కాదని తెలుసుకుంటూనే నీ బాధ్యతలు నీవు నెరవేర్చు. అదే భగవంతుడు కోరేది.

## ప్రార్థన

కం॥ నీవే నేనని తెలిసియు
నీవలె నేనుండలేక నీచుడనైతిన్
నీవలె నిలిచెడి యత్నము
నీవే నెరవేర్చవయ్య, నిను ప్రార్థింతున్

★ ★ ★



- 1 -

**శ్లో. విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యం నిజాన్తర్గతం
పశ్యన్నాత్మని మాయయాబహిరివోద్భూతం యథానిద్రయా
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.**

సీ॥ అద్దంబులో బూని అరయు దృశ్యము భ్రాంతి
నిజమైనదనిపించు ప్రజలు జూడ
ఏ భావమును జూడ ఎనసియట్లే తోచు
మిధ్యని తెలియంగ సాధ్యపడదు
నిద్రమేల్కొనగానె నిజము వెల్లడియగున్
స్వప్నమందలి మాయ సమసిపోవు
బాహ్యప్రపంచంబు భాసిల్లు బింబమై
అగుపించు ముకురాన నగరు వోలె

తే॥ మాయ విడగానె అవ్యయ మహిమ జూపి
బ్రోవ దర్శనమునకాచు దైవమూర్తి
అట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు.



## అంతరాత్మ ప్రకరణము

ఈ మొదటి శ్లోకము అంతరాత్మ ప్రకరణము అనబడును. దీనినే అధ్యారోహ అపవాద ప్రక్రియ అనికూడ అందురు. అనగా సత్యము కాకున్నను హేతుబద్ధము కాకున్నను కేవలం ప్రతీతి చేత కొన్ని విషయములు సరి అయినవిగా స్వీకరింపబడును. సూర్యుడు ఉదయించును అనుట అట్లు కనిపించినను నిజముకాదు. భూమి పరిభ్రమించుట చేతనే అట్లు కనపడుచున్నది. భూమి పరిభ్రమించుటయే నిజము. మొదట ప్రతిపాదించిన విషయము తరువాత సరికాదని నిరూపించుట అపవాదము. అద్దములో కనిపించు పట్టణము ఎటువంటిది? నిజమునకు పట్టణము అద్దములో ఇమిడినదా? లేదు. భ్రాంతి వలన అట్లు కనిపించుచున్నది. అట్లే చూచు దృశ్యమే లోప భూయిష్టము మరియు దర్పణములో ఉన్న దోషములన్నియు ఇందు ప్రతిఫలించును. అట్లే ఒక వ్యక్తిని వేరు వేరు భావములతో చూడగా వేరు వేరు వ్యక్తులనిపించినా, ఉన్నది ఒకే వ్యక్తి. అట్లే ఈ లోకమున ఉన్న సమస్త వస్తువులు, నిద్ర యందు లేవు. మన దేహము ఉన్నను, దానికి దృశ్య జ్ఞానము లేదు. కలగంటిమి. అపుడు కలలో కనిపించిన దంతయూ నిజమని నమ్మెదము. ఆ



కలలో చేసిన పనులన్నీ మనమే చేసినట్లే భ్రమ చెందెదము. కాని అది నిజము కాదు, మిధ్య. అయితే నిద్రలేవగానే ఆ మిధ్య నిజము కాదని గ్రహింతుము. అట్లే పరమాత్మ యొక్క మాయ అనెడి నిద్ర నుండి మేలుకొనగానే ఈ విశ్వమంతయూ మిధ్య అని ఆ మాయలోని రెండు గుణములైన ఆవరణము మరియు విక్షేపము అని తెలియును. ఈ ఆవరణము వలన సత్యము నిత్యము అయిన వస్తువులన్ని అసత్యము, అనిత్యముగా గోచరించును. సత్యము నిత్యము అగు వస్తువు ఏది? పరమాత్మ, వాని తత్వము. అదియే మిధ్యగా గోచరించును. అనగా పరమాత్మ లేడనియే అనిపించును. రెండవది విక్షేపము. అనగా అసత్యము, అనిత్యము అయిన ఈ చరాచర జగత్తు అంతయూ సత్యము, నిత్యముగా గోచరించును. అసత్యము, అనిత్యము అయినది సత్యము, నిత్యముగా గోచరించుట విక్షేపము. రాగద్వేషములతో కూడిన సంసారము (ప్రపంచము) అనిత్యమైనది. ఆయు: ప్రమాణము కలది. అనగా ఒకప్పుడు ఉండి, ఇంకొకప్పుడు లేకుండుట జరుగునది. ఇది అనిత్యము.అనగా మేలుకొనగా అంతయూ భ్రాంతి అని తెలియును. ఆ జ్ఞానము అబ్బిన తరువాత పుట్టుకలకు, చావులకు; మరపుకు, జ్ఞాపకమునకు బేధము లేని

అద్వైత స్థితి కలుగును. అది అందించగల సమర్థుడు ఆ గురుమూర్తియే. ఈ భ్రమలు లేనివాడు, ఆ భ్రమలు ఉన్నవారి యందు అవి తొలగించగల సమర్థుడు అయిన సద్గురువు ఆ దక్షిణామూర్తి ఒక్కడే. అందుచేత ఆయనకు నమస్కరించెదను గాక.

**- 2 -**

**శ్లో. బీజస్యాన్తరివాంకురో, జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పున**
**ర్మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్యచిత్రీకృతమ్**
**మాయావీవవిజృంభయత్యపి మహాయోగీవయస్స్వేచ్ఛయా**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.**

సీ॥ మాయావి వలె నొప్పు మాన్యుడా పరమాత్మ
యోగీశ్వరుని వోలె యున్నతుండు
ఏ వాంఛితము లేక ఏ ప్రోద్బలము లేక
మిధ్యయౌ ఈ సృష్టి మెలగ జేసె



విత్తనంబున నున్న పెను వృక్షమట్లుగా
జగతి పూర్వపు రూపు జాడనుండి
దివ్య మాయతొ వస్తు దేశకాలములన్ని
కల్పించు వైచిత్రి ఘనముకాదె?

తే॥ చేసె సర్వ స్వాతంత్రుడై సృష్టినతడు
మాయవలె తోచు ఈ సృష్టి మానవులకు
అట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు.

## మూలకారణ ప్రకరణము

ఈ శ్లోకమునకు అర్థము మూలకారణ ప్రకరణము ద్వారా చెప్పవచ్చును. అసలు జగత్తునకు మూలకారణము ఏది? ఆ పరమాత్మ. ఈ జగతియందు ఏ వస్తువునకైనను నిమిత్తము, ఉపాదానము అని రెండు కారణములు ఉండును. ఉపాదానము అనగా కార్యముగా మార్చుటకు వీలగు సామగ్రి. నిమిత్తము అనగా ఆ సామగ్రి ఉపయోగించి



కార్యము చేయు కారకుడు. ఉదాహరణకు మట్టితో కుండలు చేయు కుమ్మరి నిమిత్తము కాగా మట్టి ఉపాదానము. తనకు కారణముగా వేరొక కారణము కలిగినదే కారకం. తనకు కారణముగా వేరొక కారణము లేనిది ఏదో అదే మూలకారణం. కుమ్మరి కారణం కుండకు. కుండకు కారణం మట్టి ఆ మట్టికి కారణం ఇంకొకటి, దానికి కారణం ఇంకొకటి. అట్లు పోయిన, వాటన్నిటికి కారణం ఏదో అదే మూలకారణం. ఆ మూల కారణమే పరమాత్మ. వానికి ఇంకే కారణమూ లేదు. జగత్తు అంతయూ విత్తనమునుండి అంకురించిన వృక్షము వంటిది. విత్తనమునందు వృక్షములందున్న గుణములు అయిన కాండములు, కొమ్మలు, ఆకులు, పువ్వులు, పిందెలు, పండ్లు ఉన్నవా? లేవు. విత్తనము వృక్షమునకు కారణము అయినను, దాని లక్షణము కలిగియుండుట లేదు, అవి అన్నియూ విత్తనమునందు నిక్షిప్తము అయి ఉన్నవి. కాని ఆ విత్తనమునందు ఆ వృక్షము యొక్క ఏ భాగము కనిపించుటలేదు. అట్టి మూలకారణము అయిన ఆ పరమాత్మయందు ఈ జగత్తు యొక్క ఆది, అంతము, వృద్ధి



ఇవి ఏమియూ లేవు. ఆయన ఒక మాయావి. పంచభూతముల సాయమున విత్తనమునుండి వృక్షము వచ్చినట్లే ప్రకృతినుండి ఈ జగత్తును సృష్టించుచున్నాడు. మాయావి తన మాయచే లేని వస్తువులు సృష్టించునట్లు భ్రాంతి కల్పించి లేనివి ఉన్నట్లు చూపుచున్నాడు. కానీ ఈ పరమాత్మ మాయలు చూపించు మాయావి కాదు. ఆయన యోగీశ్వరుడు. అనగా ఇచ్ఛా, కీర్తికాంక్ష లేని వాడు. మాయ చేత ఈ జగత్తును ఉన్నట్లు కల్పించి దేశకాల వస్తువులందు వేరువేరు గుణములు కల్పింప చేసినాడు.ఆయనకు ఏ ప్రోద్బలము లేదు. ఎవరి సాయము లేదు. విత్తనములో వృక్షము జాడలేనట్లు, మూలకారణము అయిన ఈ పరమాత్మయందు, ఈ జగత్తు యొక్క ఏ గుణమూ లేదు. అనగా ఆది, అంతము, వృద్ధి లేవు. ఆయన సర్వ స్వతంత్రుడు. ఆయన మాయయే ఈ జగత్తు అనిపించిననూ ఆయనకు ఈ మాయయందు గాని, ఈ జగత్తునందు గాని, వాంఛ లేదు. మామిడి విత్తనము నుండి మామిడి వృక్షము వచ్చును. అట్లే నిత్యత్వము కలిగిన పరమాత్మనుండి మిధ్య అయిన సృష్టి వచ్చిననూ, అదికూడ సత్యముగానే

కనిపించుచున్నది. ఇదియే ఆయన యొక్క కల్పనా వైచిత్రి. దేశకాల కల్పనా వైచిత్రి అనగానేమి? ఒకవస్తువునకు దాని గుణములు దానినంటిపెట్టుకునే ఉండును. కావున దేశము, కాలము, వస్తువు అన్నియూ ఒకేసారి జనించినవి. కాని వేరు వేరుగా కాదు. ఇవి అన్ని మాయచే సృష్టించబడినవి. అనంత తత్వముకల బ్రహ్మ మాత్రం మాయా కల్పితము కాదు. కావున ఆ కల్పనకు పరిమితి బ్రహ్మ యొక్క అనంతత్వము కలుగుటయే. అదియే మాయా వైచిత్రి.

ఆ మాయా వైచిత్రినుండి భక్తులను విడిపించగల సమర్థుడు ఎవరు? ఇంకెవరు? యోగులకెల్ల యోగి, అందరికీ ఈశ్వరుడు అయిన ఆ యోగీశ్వరుడే.

అట్టి యోగీశ్వర మాయావి అయిన ఆ గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఇదే నేను వందనము చేయుచున్నాను.



**- 3 -**

శ్లో. యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యోబోధయత్యాశ్రితాన్,
యత్సాక్షాత్కరణా ద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.

సీ॥ ఎవరు సత్ రూపంబు వివరంబుగా మదిన్
స్ఫురణ మాత్రముచేత చూపగలుగు
జ్ఞానమన్ జ్యోతినజ్ఞానమడంచగా
మేటి సత్యంబుగా మిధ్యతోచు
'తత్త్వమసి' అను వేదపుతత్త్వమెరుగంగ
బ్రహ్మమే తాననే భావమెరుగు
జన్మరాహిత్యంబు చక్కగా సిద్ధించి
కర్మఫలపు ముక్తి కలుగజేయు



తే॥ ఎవరి దర్శనమ్మును పొంది భావ జలధి
యందు మరల చేరకయుంట పొందగలమొ
అట్టి శ్రీగురుమూర్తి! ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు

## తత్త్వమసి ప్రకరణము

ఈ శ్లోకము యొక్క అర్థము 'తత్వమసి' ప్రకరణము చేత తెలుపబడినది. తత్వమసి అనగా తత్, త్వం, అసి అని తెలియ వలయును. తత్ అనగా 'అది'. ఆ బ్రహ్మము నిత్యము, శుద్ధము, అనంతము, స్వతంత్రము, నిర్గుణము, నిరాకారము, నిర్లిప్తము మరియు ముక్తము అనగా బంధములు లేనిది. మరి త్వం అనగా నువ్వు అనగా జగత్తు. ఇది అనిత్యము, అశుద్ధము, అంతుగలది, అస్వతంత్రము, సగుణము, సాకారము, బహు లిప్తము మరియు బంధితము. 'అసి' అనగా అయివున్నది అని అర్థం అంటే..... త్వం అనే జగత్తే



తత్ అనే బ్రహ్మము అయి ఉన్నది అని అర్థము. అదెట్లు సాధ్యము? పూర్తి వ్యతిరేక భావములు ఉన్న ఆ రెండూ ఒకటే ఎట్లు అవును? దీనిని 'జహ దజహ' లక్షణము చేత వివరింప వచ్చును. అది ఎట్లనిన, పెద్దలను ఎగతాళి చేసిన కళ్ళు పోవును అనెడి నీతి వాక్యమును తీసుకొనుము. 'జహ దజహ' లక్షణము అనగా కొంత భాగమును తీసుకొని, కొంతభాగమును పరిత్యాగము చేసి, కొంత భాగమును జతచేర్చి, తాత్పర్యము చెప్పుకొనవలెను. పై వాక్యమున కళ్ళుపోవుట అనగా పాపము వచ్చుట అని నిజమైన అర్థము. కండ్లుపోవుటను త్యాగము చేసి, పాపము వచ్చుటను జతచేర్చి, తాత్పర్యము చూచినచో, పై వాక్యము పూర్తిగా అర్థమగును. అట్లే తత్ త్వం అసి అను దానియందు త్వం అనెడి పదమునుండి జగత్తునకు గల నామరూపములను త్యజించవలెను. ఇక జతచేయవలసినది తత్. అనగా అనంత విశ్వములో నామరూపములు కలిగిన ఏ వస్తువునకైన ఆ నామరూపములు అనే పొరలను త్యజించి చూడగా... తత్ అనే బ్రహ్మత్వము త్వం అనెడి ఆ పరమాత్మ అయి ఉన్నది అని అర్థం. అనగా

త్వం లోని గుణ పరిచ్ఛేదన జరిగితే, తత్ త్వం అసి ఔతుంది. నీవే పరబ్రహ్మ అనే మౌలిక సత్యం తేటతెల్లమౌతుంది. అనగా భ్రాంతి, గుణ, వికారములు వదలివేసిన 'నేను' అనే ఈ జగతిలోని వస్తువే, అనంతమైన బ్రహ్మము అయి, తత్ త్వం అసి అవుతుంది. అయితే 'నేను' కు గుణ వికార భ్రాంతులను వదలివేయుట సాధ్యమా?

సాధ్యమే. ఆ గురుమూర్తి దయవలన, మన సాధన వలన సాధ్యమే. అదియే మోక్షము. నీటి కుండలో ఆకాశమును సూర్యబింబమును చూసి, అందే సూర్యుడు ఉన్నట్లుగా భ్రమ చెందెదము. కాని విడి విడిగా చూచినచో, సూర్యుడు సూర్యుడే. నీటికుండ నీటికుండే. అవి రెండు వేరువేరు అని తెలిసి కొందుము. అట్లే దేహోపాధి పొందక పూర్వము నేను అయినది ఈ శరీరము కాదు, ఆ జీవాత్మయే. దానికి కూడ గుణ వికార భ్రాంతులు లేవు. దేహము వచ్చాక మాత్రమే అవి కలిగాయి. ఇది భ్రాంతి. దీనిని త్యాగము చేసిన, జీవాత్మ తత్వమే పరమాత్మ తత్వం అని తెలియును. అదే... అద్వైత



తత్వము. దేహము అనిత్యము అని దీని గుణ వికార భ్రాంతులు అనిత్యములని తెలిసి సాధనచే ప్రయత్నించిన 'తత్వమసి' సిద్ధించగలదు. సాక్షాత్తూ ఆ దక్షిణామూర్తే ఈ విషయమును బోధించుచున్నాడు. అనగా అనంతుడు అయిన ఆయన తానే తన అనంత తత్వమును తెలియ పరచుచున్నాడు. ఆయనే చెప్పినప్పుడు ఈ తత్వమసిని గ్రహించాక చేయు కర్మలకు ఫలమే ఉండదు. ఫలమే లేనప్పుడు జన్మ రాహిత్యమే కదా! ఈ జన్మయందు కూడ భావ జలధిలో మునిగే ప్రసక్తే ఉండదు. జ్ఞానమే నిండిన జీవికి, మిధ్య అయిన వాటియొక్క సత్తు అనగా నిజమైన రూపములు తెలియును. పరమాత్మయొక్క తత్ అనగా సత్తు యొక్క రూపము తెలియగానే, ఆయన నిరాకార నిర్గుణ రూపము అవ్యయ తత్వము తెలిసి ఆయనే 'నేను' అని తెలిస్తే... అజ్ఞానమనే అంధకారం తొలిగిపోతుంది. అటువంటి అంధకారమును తొలగించి జ్ఞానము కలిగించ గలిగిన కైవల్యమూర్తి, గురుమూర్తి అయిన ఆ దక్షిణమూర్తి ఒక్కడే.. అందుచేత గురుమూర్తి అయిన ఆ దక్షిణామూర్తికి ఇదే వందనము చేయుచున్నాను.



## - 4 -

**శ్లో. నానాచ్ఛిద్రఘటోదరస్థిత మహాదీప ప్రభాభాస్వరం**
**జ్ఞానం యస్య తు చక్షురాదికరణద్వారా బహిస్పందతే,**
**జానామీతి యమేవ భాన్త మనుభాత్యేతత్సమస్తం జగత్**
**తస్మైశ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే**

సీ॥ ఒక్క దీపంబును బెక్కు రంధ్రములున్న
ఘటమునందుంచుచు కాంచినంత
కిరణాలు కన్నులన్ మెరపింప జగతిని
అరయ గల్గుచునుంటి ఆ విధముగ
జీవాత్మ నెలకొని నవరంధ్ర దేహాన
జ్ఞానమన్ జ్యోతిచే జగతి దెలుపు
పరమాత్మ ఆరీతి పరగింప అనుభూతి
తను చూచెనని జీవి తలచుచుండు



తే॥ ఎవరి మహిమచే జగతిని ఎరుగగలనొ
ఎవరు జగమెల్ల భాసించి ఎరుకయగునొ?
అట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు

### స్వప్రకాశతా ప్రకరణము

ఈ శ్లోకము యొక్క అర్ధము స్వప్రకాశతా ప్రకరణము చేత తెలుసుకొనవచ్చును. స్వప్రకాశము కలది ఎవరు? పరమాత్మ. వాని ప్రకాశ ప్రభావితము అయినదే ఈ జగత్తు. జగత్తును చూడగల పరమాత్మ యొక్క స్వప్రకాశమును జ్ఞాన సముపార్జనచే తెలుసుకొనగలము. అజ్ఞానముతో చూచునది కేవలము జగత్తునే.

ఒక కుండకు రంధ్రములు చేసి ఆ కుండయందు ఒక దీపము ఉంచిన ఆ రంధ్రములనుండి ప్రకాశ కిరణములు వెలికి వచ్చును. ఆ ప్రకాశమున బయుటి వస్తువులు కనిపించును. ఈ కిరణములకు మూలము జ్యోతి. దేహమనెడి

ఈ కుండకు నవరంధ్రములు కలవు. ఆత్మ అనెడి జ్యోతి ఇంద్రియముల ద్వారా తన శక్తిని కిరణముల వలె ప్రవహింపచేసి బాహ్య విషయములను అనుభవించునట్లుగా చేయును. కిరణములు జ్యోతిని వెలిగింపలేవు. కేవలము బయట వస్తువులనే వెలిగింప గలవు అట్లే ఇంద్రియ వ్యాపారములు బాహ్య విషయములనే అనుభవించగలవు గాని ఆత్మను ఏమాత్రము అనుభవించలేవు. ఘటము విచ్ఛిన్నము అయినచో జ్యోతి మిగులును. అట్లే దేహము నశించినచో ఆత్మ నశించి పోదు.అది మిగులును. అవివేకము చేత ఇంద్రియ వ్యాపారములే నేను చేస్తున్నాను అనెడి భ్రమ కలుగుచున్నది. దేహము ఆత్మను అనుభవించలేనట్లే ఇంద్రియములు పరమాత్మను అనుభవించలేవు. వెలిగింపలేవు. ఆయన సూర్య చంద్రులను వెలిగించునే గాని సూర్యచంద్రులు ఆయనను వెలిగించలేరు.

ఇక ఘటస్థ దీపము పరమాత్మ అయినచో.. ఆయన ప్రసరించు జ్ఞానజ్యోతి ఆత్మలుగా ఒక్కొక్క వ్యక్తిని వెలిగించును.



ప్రతి జీవిని వెలిగించ కలుగుచున్నది. ప్రతి జీవికి ఆ పరమాత్మ యొక్క అంశము వీనియందు ప్రవేశించుట చేతనే కదా వీనికి చైతన్యము కలుగుచున్నది. లేనిచో ఈ శరీరమునకు చలనము ఏది? ఈ చలనము కలిగించునది, కదలుచున్న శరీరమునకు జ్ఞానము ఒసగుచున్నది గురుమూర్తి అయిన ఆ దక్షిణామూర్తియే కదా! నేను చూచుచున్నాను అనెడి భ్రాంతి వీడి, ఆయన వెలిగించుచున్నాడు అని తెలియుటయే జ్ఞానము. అట్టి జ్ఞానము ఒసగుచున్న, ఆ గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఇదే వందనము చేయుచున్నాను.

**- 5 -**

**శ్లో. దేహంప్రాణమపీంద్రియాణ్యపి చలాంబుద్ధించశూన్యం విదు:**
**స్త్రీబాలాంధజడోపమాస్త్వహమితి భ్రాన్తా భృశంవాదిన:,**
**మాయాశక్తి విలాసకల్పితమహావ్యామోహ సంహారిణే**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే**



సీ॥ బాలాంధ స్త్రీజడుల్ బోలిన మానవుల్
నేను అనునదేదొ నేర్వలేక
చిత్తభ్రమకు లొంగి చెడు వాదనలు చేసి
అనుకొందురీ రీతి జ్ఞానమొదిలి
దేహమో ప్రాణమో దేహేంద్రియమ్ములో
నేనె అవందురు నేర్పులేక
జ్ఞానమ్ము వదులుచు చరియించు మూర్ఖులు
దీని కారణమేదొ తెలియ లేరు

తే॥ మాయ కల్పించు వ్యామోహ మహిమ సుమ్మి!
నాశమొందించి వ్యామోహ పాశమణచు
నట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు.

## నిర్విశేషతా ప్రకరణము

ఈ శ్లోకముయొక్క అర్థము నిర్విశేషతా ప్రకరణము చేత విశదీకరింపబడుచున్నది. అనగా ఆత్మకు విశేషతే లేదు అనెడి



భ్రాంతి కలిగియున్న జీవుడు, పరమాత్మ తత్వమును అర్థము చేసుకొనలేడు. మానవులలో కొందరు స్త్రీలు, బాలురు, అంధులు, జడులు వలె పరిమిత జ్ఞానము కలిగి, పరిమిత బుద్ధితో వ్యవహరింతురు. స్త్రీలు ప్రపంచమును చూడక, బాలురు బుద్ధి వికాసములేక, అంధులు కన్నులు లేక, జడులు పరిమిత జ్ఞానము కలిగి వ్యవహరింతురు. నలుగురు అంధులు ఏనుగు ఎట్లుండునో తెలియగోరి దానిని తడిమి ఏనుగు అనిన చేటల వంటి పెద్ద చెవులని ఒకడు, స్థంభములవంటి కాళ్ళు అని ఒకడు, తొండము తడిమి పెద్ద పొట్లకాయలాంటిది అని ఒకడు, దంతములని తడిమి పెద్దకొమ్ములని ఒకడు విశ్లేషించినట్లు, మానవులు భ్రమకు లోనై, నేను అనగా ఏమిటో గ్రహించలేకున్నారు. నేను అనగా దేహమా, ఇంద్రియములా, మనస్సా, బుద్ధియా, లేక తెలివితేటలా? మూర్ఖులు వాదన చేస్తారు. ఒక శాస్త్రజ్ఞుడు ఒక సిద్ధాంతము ప్రతిపాదించి భూమి బల్లపరుపుగా ఉందని వాదించును. కొందరు అదే నిజమని విశ్వసిస్తారు. అంతమాత్రము చేత భూమి అట్లుండునా? తర్కమున వాదనే

కాని అన్నివేళలా నిజము వెలువరించబడదు. బాహ్య పరిశీలనతో నేను అనగా ఈ ఇంద్రియముల వ్యాపారమే అని భావించు వారికి మిగులునది కేవలము వాదన మాత్రమే. సత్యము కాదు. ఆ అజ్ఞానమును నాశనము చేయగల సమర్థుడు ఆ గురువు శ్రీదక్షిణామూర్తియే. భక్తిమార్గమున ఆయనను శరణని ఆయన అనుగ్రహము చేత నేను అనునది ఇంద్రియములు కాదని అది అలౌకిక తత్వముగల ఆత్మ అని అర్థము కాగలదు. మరియు జడమైన నేను నిత్యమైన ఆత్మ ఎట్లగుదును? స్వయముగా జడమైనను ఈశ్వర సమాగమముతో జ్ఞానము లభించి ఆ 'నేనే' ఈ 'నేన'ని గ్రహించగలిగి, ఈ జీవాత్మయే పరమాత్మగా గ్రహింప కలుగును. అట్టి జ్ఞానము కలిగించు గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా వందనములు.

**- 6 -**

శ్లో. రాహుగ్రస్తదివాక రేందుసదృశోమాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్ర:కరణోపసంహరణతోయో భూత్సుషుప్త:పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే య: ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే.



సీ॥ రాహువాచ్ఛాదించు రవిచంద్రులను జూచి
తినబడిరను భ్రమన్ తేలినటులె
కమ్మిన మాయచే కలిగిన నిద్రలో
ఇంద్రియోపహరణ నిచ్ఛజేయ
దేహముండియు కూడ దేహకర్మలు లేని
స్థితిలోన జీవుడు చేరియుండు
నిద్రలేచినయంత నిజదేహ ధర్మాన
జీవుడు తననుగా తెలిసికొనును

తే॥ తెలిసి 'ప్రత్యభిజ్ఞ' ను చేసి తలచుచుండు
మునుపు నిద్రనున్నదియును నేనె యంచు
అట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు

## ఆత్మాచ్ఛాదనా ప్రకరణము

ఈ శ్లోకము యొక్క అర్థము ఆత్మాచ్ఛాదనా ప్రకరణము ద్వారా తెలియనగును. ఇది అవస్థాత్రప్రక్రియ ద్వారా



తెలుసుకోనగును. అనగా మెలకువ, స్వప్నము, గాఢనిద్ర అను మూడు అవస్థలు గలవు. మనిషి ఏదో ఒక అవస్థలో ఉండి అదే నిజమని భ్రాంతి చెందుచుండును. ఈ మూడిటియందును ఉన్న 'నేను' అన్నది నిత్యము. నిజానికి ఆ మూడు అవస్థలూ అనిత్యములే. మిధ్యయే. మరి వాటి యందు నిత్యమైనది ఏది? అదే.. బ్రహ్మము. జీవము ఉన్నది గదా ఈ అవస్థలయందు? ఈ మూడింటిలో ఉన్న 'నేను' అనిత్యము అనిపించిననూ, 'నేను' అనే జీవాత్మయే బ్రహ్మము అయి, అట్లు అనిపించుచున్నది. సుషుప్తిలో అనుభవ శూన్యత ఉన్నది. అదే మూలముకదా అనెడి వాదనలో అసంపూర్ణత్వము కలదు.

రాహువు సూర్యచంద్రబింబములను కప్పినపుడు రాహువు వాటిని తినెను అనెడి భ్రమ కలుగుచున్నది. కాని నిజమునకు అది నీడయే.

సూర్యుడు కనిపించక పోవుట నీడ వలన కలిగిన భ్రమ. నిజమునకు సూర్యునకు జరిగిన మార్పు ఏమియూ లేదు. అట్లే చంద్రగ్రహణము కూడ. కొన్ని ప్రాంతముల వారికి ఈ గ్రహణము కనిపించను కూడ కనిపించదు. ఎట్లు ఉన్నది



లేనట్లు తోచును? ఎట్లు సుషుప్తియందు సత్తు అనుభవ శూన్యము అగుచున్నది? ఎట్లు జాగ్రదవస్థ యందు అనుభవము కలిగి, విషయ సంగ్రహణము జరుగు చున్నది? స్వప్నమున సూక్ష్మ రూపమున అనుభవ సారము ఎట్లు గ్రహింపబడును? అట్లే నిద్రయందు విషయ సంగ్రహణము లేకున్ననూ సత్తునందు మార్పు లేదు, శూన్యత లేదు. కేవలం సాధన సామాగ్రి కొరవడి ఇంద్రియ గ్రహణము కొరవడి, అనుభవము కలుగుట లేదు. అయితే, జాగ్రదావస్థయందు సాధన సామాగ్రి యున్నను స్వప్రకాశ ప్రకరణములో తెలిపినట్లుగా ఇంద్రియములు అనుభవించునది ఆ పూర్ణ సత్తుయొక్క అంశమే అని తెలియనగుచున్నది. సుషుప్తినుంచి మేల్కొనగానే హాయిగా నిద్రించితిమి అనుకుందుము. ప్రత్యభిజ్ఞతతో ఆ నిద్రించినది 'నేనే' అని తలంతుము. ప్రత్యభిజ్ఞ అనగానేమి? ఒక వస్తువును మనము స్మరించిన చాలును. అది మన ఎదుటకు రానవసరము లేకనే దాని ఆకార గుణములు ఊహకందును. వస్తువుకూడా అనుభవములోనికి రానవసరం లేదు. కేవలం

స్మరణ చాలును. కాని ప్రత్యభిజ్ఞ ఆ వస్తువు అనుభవ పరిధిలోకి రాగా జరిగిన స్మరణ. ఈ స్మరణ దేశకాలములు భిన్నము అయినచో భిన్నముగ కలుగును. మన చిన్న నాటి స్నేహితుని సహ ఉద్యోగిగా చూచిన మన చిన్ననాటి పాఠశాల విషయములు జ్ఞప్తికి వచ్చును. ఈ స్మరణే ప్రత్యభిజ్ఞతో సుషుప్తిలోనూ తాను జాగ్రత్తలోని తాను ఒకటేనని భ్రమించుట జరుగుచున్నది. ఆ నేనే ఈ నేను అని తలంచుచున్నది ఎవరు? దేహమా? జీవాత్మా? దేహము అనుకొనుట అసత్తు. జీవాత్మ అనుకొనుట సత్తు. అనగా నిజము. దేహధారి అయిన జీవుని వాని ఆత్మను వేరు చేయుచున్నది ఆ మాయయే. అవిద్య వల్ల చేరిన మాయయే ఆత్మ ఆఛాదన తొలగగానే ఆ నేనే ఈ నేను అని తెలియగలదు. అట్లు తెలియచేయు ఆ గురుమూర్తి శ్రీదక్షిణామూర్తికి ఇదే వందనము చేయుచున్నాను.



**- 7-**

శ్లో. బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమాన మహమిత్యంత:స్ఫురంత స్సదా,
స్వాత్మానంప్రకటీకరోతిభజతాం యోభద్రయాముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణా మూర్తయే

సీ॥ బాల్యంబునుండియు ప్రాణమొదులు దాక
నెగడి మేల్కొనియున్న, నిద్రనున్న
కలుగు మార్పులు అన్ని కాయంబుకే, తను
తిరుగును తనువులన్ దేహి ఒకడు
జీవాత్మ మారదు చివరి కైక్యంబగున్
భక్తిచే పరమాత్మ బడయుననుచు
శుభకరం బగుముద్ర చూపుచు ప్రకటించు
జీవాత్మ పరమాత్మ చేరు స్ఫురణ

తే॥ చేర్చుకొను పరమాత్ముండు జీవి ఆత్మ
తనను భజియించువారికి తనను తెలుపు
నట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు



## అవికారతా ప్రకరణము

ఈ శ్లోకముయొక్క అర్థము అవికారతా ప్రకరణము ద్వారా తెలియనగును. ఇందు ప్రత్యభిజ్ఞ ప్రక్రియే కాక అన్వయ వ్యతిరేక ప్రక్రియ కూడ కలదు. దేశకాల వస్తుస్థితులయందు మార్పు జరిగినను సత్తుయొక్క స్థితి మార్పు చెందనిది అని గ్రహించగా జాగ్రదావస్తకూడ ఆత్మయందు అవికారిగా ఉండును. మార్పు చెందనిది అవికారి. నేను రాముడను అని బాల్య, యవ్వన, వృద్ధాప్య, సుషుప్తి, జాగ్రదావస్థలయందు తలంచుట రాముడనెడి వాడు చేయును. కాని రాముడనగా ఎవరు? 'నేను'. నేను అనగా ఎవరు? శరీరమునకు జరిగిన మార్పులన్ని, 'నేను' అనే వానికి జరుగుటలేదు. అది నేనుగానే ఉన్నది. ఎందుచేత? నేను అనుకున్నది నిజముగా ఏమార్పు లేని జీవాత్మ. అది మనకు తెలియుటలేదు. భూమి పైనుండి ఆ భూమి వేగముతో తిరుగుచున్ననూ మనకు అసలు తిరుగుచున్నట్లే తెలియుట లేదు. అట్లే 'నిత్యము' అయిన ఆ 'నేను' జీవాత్మయే. అది పరమాత్మను చేరుట ఎట్లు? కేవలము



తనను భజించిన వారికే సాధ్యమగునని ఆ దక్షిణామూర్తి చెప్పుచున్నాడు. అశ్వద్ధ వృక్షము కింద అభయ ముద్రలో కూర్చునియుండి చెప్పుచున్నాడు. అట్టి మహత్తరమైన ఆ ముద్ర ఎట్లుండెను? తన కుడిచేతి చివరి మూడు వేళ్ళు నిటారుగ నిలిపి, చూపుడు వేలును వంచి బొటన వేలుకు తగిలించుచు, జ్ఞాన ముద్రలో ఉండి అభయమిచ్చుచున్నాడు. మూడు వేళ్ళు జగత్తు యొక్క త్రిగుణాత్మకమైన స్వభావమునకు ప్రతీక. ఇంక చూపుడు వేలు నిటారుగ నిలచి జగత్తుతో సంబంధము పెట్టుకొనకుండా ఉన్న స్వచ్ఛమైన జీవాత్మను సూచించుచున్నది. ఆ జీవాత్మ పరమాత్మనుండి దూరమై విడిగా ఉన్నట్లు తోచును. చూపుడు వేలు బొటన వేలితో వలయముగా ఏర్పడుట భక్తుడు వినమ్రుడై పరమాత్మను చేరుటకు ప్రయత్నించుటను తెలుపుచున్నది. జ్ఞానమంతయూ ఇట్టి ఒక్కముద్రలోనే చూపించకలిగిన సద్గురువు ఆ దక్షిణామూర్తి. ఆయనకంటే వేరే గురువు ఎవరు? లేరని తలంచుచు, ఇదే నేను నమస్కరించుచున్నాను.

**- 8 -**

**శ్లో. విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబంధత**
**శ్శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదత:,**
**స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయాపరిభ్రామిత**
**స్తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణా మూర్తయే.**

సీ॥ కాంచు పురుషుడిలన్ కార్యకారణ రూప
భావమ్ముతో భేద భావమలర
దాసుండు, యజమాని, తండ్రియు, సుతుడును
గురుశిష్య సంబంధ మరయుచుండు
స్వప్న జాగ్రత్తలన్ చరియించు జీవాత్మ
భ్రాంతిచే భేదంపు భావ మరయు
మాయచే భ్రాంతిని మతిపోయి దేహాన
జీవాత్మలొక్కటి అవుట మఱచు

తే॥ ఎవరు ఇటువంటి మాయలో ఇమడకుండ
తానె పరమాత్మ రూపునే దాల్చి యుండు
నట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు.



## అనపేక్షతా ప్రకరణము

ఈ శ్లోకము యొక్క అర్థము అనపేక్షతా ప్రకరణము ద్వారా తెలియ పరచవచ్చును. ఇది కార్యకారణ ప్రక్రియ. అనగా శాస్త్రమును అనుభవ సారముగా కాని లౌకిక ప్రక్రియతో మూలకారణమును వెతుకుట. అనపేక్ష ప్రక్రియ అనగా కార్యకారణ సంబంధము వదిలి నిరపేక్షముగ వాదన లేకుండా ఆత్మను దర్శించుట. ఈ జగతిలో కన్పించునది ఏదియూ ఆత్మకాదు. అది అనాత్మ. ఆత్మ ఎన్నడూ కనబడదు. దానిని అతి ప్రయత్నముచే గాని తెలుసుకొనుటకు వీలులేదు. దానిని తెలుసుకొనగోరు వానిని బ్రహ్మవేత్త అందురు. వానికి ఆత్మ విచారముతో పనిలేదు. అతనికి అనాత్మ కూడా ఆత్మవలనే కనిపించును. అయితే మిధ్య అయిన అనాత్మ తత్వమును నిత్యమైన ఆత్మ తత్వముతో ఏకీభవింపచేయుట దోషము అదిచేయుచున్నది ఎవరు? జీవి తన దేహమే తను అనుకొనునట్టి అజ్ఞాని గనుక జీవియే అట్లు భ్రమించుచున్నాడు.

అవిద్య అను మాయావశిష్ఠుడు అయి జీవి ఆత్మ వేరని తలచుచు నీ ఆత్మ నా ఆత్మ వాని ఆత్మ అనెడి భేద భావముతో



కార్యకారణ ప్రక్రియ ద్వారా యజమాని, భృత్యుడు, తండ్రి, కుమారుడు, గురువు, శిష్యుడు, వారివారి సంబంధము వల్ల వారి వారి ఆత్మలు వేరని తలచును. అనగా తండ్రికి కుమారుడు, కుమారునకు తండ్రి కారణము. కుమారుడు కలుగుట చేతనే తండ్రి అయ్యెను. తండ్రి యుండుట చేతనే కుమారుడు జన్మించెను. అందుచేత తండ్రి కుమారుడు వేరు అని భావించుచున్నారు. కాని నిజమునకు వారు వేరు కాదు. వారివారి ఆత్మలు ఏమాత్రమూ వేరుకాదు అవి అన్నియూ ఒక్కటే. స్వప్నములో ఉన్న నేను, మేల్కొని ఉన్న నేను వేరు కాదని ఎట్లు తలంతుమో ఇదియునూ అట్లే. ఇది అంతయూ మాయే. కార్యకారణ ప్రక్రియ వల్లనే జరిగినది. గురువునకు శిష్యుడు, యజమానికి భృత్యుడు కూడ ఇటువంటిదే. ఒకరికి ఒకరు కారణము. అందుచేతనే వారు వేరువేరుగా తోచుచున్నారు. కాని ఇది భౌతికమైన వేరు వేరు, ఆత్మలు వేరుకాదు. ఆత్మలలో ఏవిధమైన మార్పు లేదు. ఇందు ఒక స్థితి లేనిదే ఇంకొక స్థితిలేదు. నామరూపములు బేధములే కాని వీని ఆత్మలకు ఏ భేదములులేదు. ఆత్మ అవగాహన ఒనర్చుకున్న బ్రహ్మవేత్త చివరికి అనాత్మలందు కూడా ఆత్మను



దర్శించగలడు. జంతువులయందు సామాన్యులయందు గొప్పవారియందు అందరియందు కలిగిన ఆత్మ ఒక్కటేనని ఎవరు గ్రహింతురో వారే బ్రహ్మవేత్తలు. ఇక అటువంటి బ్రహ్మవేత్తలందరికి సద్గురువు, ఈ మాయా విచ్ఛేదకుడు అయినది ఎవరు? ఆ దక్షిణామూర్తియే. ఆయనకు తక్కువ ఏమున్నది? ఆయనకు ఆత్మ, అనాత్మల బేధమే లేదు. అటువంటి గురుమూర్తి అయిన శ్రీదక్షిణామూర్తికి ఇదియే నమస్కరించుచున్నాను.

**- 9 -**

**శ్లో. భూరంభాంస్యనలో నిలోంబరమహర్నాథో హిమాంశుః పుమా,**
**నిత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకమ్,**
**నాన్య త్కించన విద్యతే విమృశతాం యస్మా త్పరస్మా ద్విభో,**
**స్తస్మై శ్రీగురుమూర్తయే నమః ఇదం శ్రీదక్షిణామూర్తయే.**

సీ॥ అష్టరూపమ్ముల అలరారి పరమాత్మ
ఈ చరాచర విశ్వమెల్ల నిలచు
వాయు, వగ్నియు, నింగి, వారియు, రవి, చంద్రు,
లవని, జీవుండును యన్నరీతి

సూర్యచంద్రులు కాదు, సూక్ష్మబుద్ధి మనస్సు
అందురు వాదించి కొందరట్లు
తత్త్వవేత్తలకెల్ల తనె భర్త దైవంబు
పరమాత్మ ఆరీతి బరగుచుండు

తే॥ తత్త్వవేత్తల భర్తయౌ తానెవండో?
ఎవరనన్యుడై బ్రోచునో జీవకోటి
నట్టి శ్రీగురుమూర్తి ఓ అనఘ! గొనుము
వరద! శ్రీదక్షిణామూర్తి! వందనములు.

## అనన్యతాప్రకరణము

ఈ శ్లోకము యొక్క అర్థము అనన్యతా ప్రకరణము ద్వారా విశదీకరింప బడుచున్నది. ఇది ఉపాసన పరమైన శ్లోకము దక్షిణామూర్తి అష్టకము అనిన ఎనిమిది శ్లోకములే. తొమ్మిదవది ఉపాసనా సూచకము అని పదవది ఫలశృతి అని విశదీకరింపబడుచున్నది అని కొంతమంది విజ్ఞుల



అభిప్రాయము. అయితే ఈ రెండు శ్లోకములందు కూడ ఎంతో తత్త్వ ప్రతిపత్తిని ఆ ఆదిశంకరులు కల్పించినారు. అందుచేత ఈ తొమ్మిది, పది శ్లోకములు ఎంతో పారమార్థకతను సంతరించుకున్నవి. ఇక ఈ అనన్యతా ప్రకరణము గూర్చి తెలుసుకొందుము. పరమాత్మ ఎనిమిది రూపములుగా కనిపించుచున్నాడు. అనగా ఈ ప్రపంచమున మనుష్యులకు ఎనిమిది రూపములుగా తోచుచున్నాడు. అవి అవని అనగా భూమి, వాయు అనగా గాలి, ఆకాశము, అగ్ని, జలము అనగా నీరు, సూర్యుడు, చంద్రుడు, జీవుడు. అయితే కొంతమంది తత్వజ్ఞులు సూర్యుడు అనగా బుద్ధి అని, చంద్రుడు అనగా మనస్సు అని అర్థము చెప్పుచున్నారు. మొత్తానికి ఈ ఎనిమిది రూపములలో పరమాత్మ తన తత్వమును చూపుచున్నాడు. పరమాత్మ ఈ ఎనిమిది రూపములలో ఏ రూపములోనైనను ఉండవచ్చును. తత్వజ్ఞులు శ్రీమద్ భగవద్గీతలో అదే గ్రహించారు. సర్వభూతాల్లోను పరమాత్మ ఉంటాడు. ఎట్లా ఉంటాడు అంటే జీవాత్మ రూపంలో ఉంటాడు. మరి ఆ



విధంగా చూస్తే జీవాత్మలన్నీ ఒక్కటే. ఎనిమిది రూపాలుగా ఆ పరమాత్మే ప్రకృతి అంతా విస్తరించాడు. ఆయన అంశ లేనిది రూపు కానిది ప్రకృతిలో ఏదీ లేదు అని ఘంటాపథంగా శ్రీ శంకరాచార్యుల వారు బోధిస్తున్నారు. అనన్యుడు, అచింత్యుడు అయిన ఆ దక్షిణామూర్తి రూపుకానిది ఏదీ ఈ జగత్తున లేదు. ఎట్లుండును? అటువంటి గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఇదే నేను నమస్కరించుచున్నాను. ఇట్లు అనన్యత అనగా అన్యమైనది ఏది పరమాత్మ తప్పలేదు అని చెప్పేదే ఈ తొమ్మిదవ శ్లోకము.

### - 10 -

**శ్లో॥ సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిన్ స్తవే**
**తేనాస్య శ్రవణాత్తదర్థమననాద్ధ్యానాచ్చ సంకీర్తనాత్**
**సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం స్వత:**
**సిద్ధ్యేత్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్యమవ్యాహతమ్.**



సీ॥ స్తవమునిద్దానిని శ్రద్ధగా చదివిన
సర్వాత్మ తత్త్వంబు సాధ్యమనియు
స్పష్టమగుటచేత చక్కగా దీనిదౌ
తాత్పర్యమననంబు తమిని చేయ,
చేయంగ ధ్యానమ్ము, చేయ సంకీర్తనన్
ఏ అవరోధమ్ము లెరుగకుండ
సర్వ ఆత్మత్వమ్ము సగుణ వైభవముచే
ఈశ్వరత్వము జీవుడెరుగ గలుగు

తే॥ అష్ట సిద్ధులున్ శ్రమలేక అమరితీరు
తలచి సర్వాత్మ తత్త్వాన నిలచుయోగి
గురువు సాయము ఎన్నడు కోరబోడు
జగతినీశ్వర ప్రాప్తిచే శాంతిగనును.

## పరమాత్మ ప్రకరణము

ఈ ఆఖరి శ్లోకము యొక్క అర్థము పరమార్థ ప్రకరణము ద్వారా తెలుసుకొన వచ్చును. మొదటి ఎనిమిది శ్లోకాలలో

అద్వైత తత్వమును బోధించిన గురుమూర్తి అనన్యతా తత్వాన్ని తొమ్మిదవ శ్లోకములో బోధించిన ఆదిశంకరులు ఇక పదవదీ ఆఖరిదీ అయిన ఈ శ్లోకములో ఈ స్తవము చదివిన వారికి, విన్న వారికి, (వ్రాసిన వారికి) ఫల శృతిని వివరించుచున్నారు. 'శ్రవణము' చేతను బోధన చేతను మననము చేతను ఏ సాధకుడు అయినా సర్వాత్మత్వము సంతరించుకొనగలడో (శ్రవణము అనిన ఈ చెవితో విని ఆ చెవితో వదలుట కాదు. జిజ్ఞాస ఏకాగ్రత ముప్పిరి కొనగా వినుటయే శ్రవణము) ఈ శ్రవణము విశ్వాస పూరితము కనుక మనస్సున జీర్ణించి వెనువెంటనే 'శ్రవణము' చేసిన తత్వమును ఆత్మ గ్రహించును.

'మననము' అనిన పదే పదే స్మరించుట. అట్లు చేసి మానసికముగా పరమాత్మను దర్శించు ప్రయత్నము చేయవలెను.

'మననము' చేత కూడా తత్వదర్శనము కానిచో 'నిధి' ద్వారా అనగా ధ్యానించుట వలన సర్వాత్మ తత్వము అబ్బగలదని శంకరుల నిశ్చితాభిప్రాయము. ఇది శరీర స్పృహ



అంతరించిన జ్ఞానులకు మాత్రమే సాధ్యము. వంటచేయు వానికి వేడి దానంతట అదే కలిగినట్లు సర్వాత్మత్వము అనగా అన్ని ఆత్మలు ఒక్కటే అని తెలిసినవారికి తనంత తానే ఈశ్వరత్వము ప్రాప్తించును. అప్పుడు జీవాత్మకు పరమాత్మకు ఏమాత్రము భేదము కనిపించదు.

కాని అది జరుగుటయే చాలా కష్టం. సర్వాత్మత్వము అంత తేలికగా లభించునది కాదు. మనను కరవబోయిన కుక్కను రాయితో కొట్టెదము. అది మనకు సహజము అంతేకాని దాని ఆత్మ మన ఆత్మ ఒక్కటే అని దానిని వదిలి పెట్టువారు ఉందురా? అట్లు చేయువారు మహాత్ములు. అంతెందులకు మనలను ఎవరన్నా నిందించిన తిరిగి వారిని వెంటనే నిందింతుము. ఆ ఎదుటి వాడు కూడా మనవంటి ఆత్మ కలవాడేనని భావించి వానిని వదిలి పెట్టువారు ఉందురా. లేదు. అట్లు భావించకుండుట చేతనే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యము అను ఆరు శత్రువులకు లొంగి మనిషి ప్రవర్తించుచున్నాడు. ఈ విధముగా జీవాత్మలు



ఒక్కటియే అని గ్రహించ లేకపోవుటయే అజ్ఞానము. అందుచేతనే మనకు ఈశ్వరత్వము సిద్ధించుటలేదు. ఏనాడైతే జీవాత్మకు పరమాత్మకు భేదములేదని గ్రహించి ఈశ్వరత్వము పొంది సర్వాత్మత్వము సాధన చేయుట ప్రారంభింతుమో.. ఆనాటి నుండే మోక్ష ప్రాప్తి కనుట ప్రారంభించును. అది సిద్ధించిన మోక్షప్రాప్తి తప్పక కలుగును. సర్వాత్మత్వము తెలియకుండ ఈశ్వర ప్రాప్తికి ప్రయత్నించినను ఫలితము ఉండదు. రావణ, హిరణ్యకశిపుల వంటి రాక్షసులు పరమాత్మ దర్శనము పొంది కూడ భోగలాలసతో వరాలు కోరారు. అందుచేతనే వారికి ఈశ్వరుని దయ కలిగి కూడా సర్వాత్మత్వము సిద్ధించలేదు. అందువల్లనే రావణుడు అల్పులుగా తలచి నరుల వల్ల వానరుల వల్ల మరణము లేకుండునట్లు కోరుకొనలేదు. ఎందుచేత అనగా వానరులు నరులు అల్పులు అని వాని భావము. అందుచేతనే కామ, క్రోధములకు లొంగి చివరకు నశించాడు. కావున ఈశ్వర ప్రాప్తికి ముందే సర్వాత్మత్వము సిద్ధించవలెను. అట్టి బ్రహ్మవేత్తకు కలుగు



బ్రహ్మానందమును మామూలు ఆనందముతో పోల్చుట మన భూమండలమును నారింజ పండుతో పోల్చుట వంటిది. భూమండలము నారింజ పండు ఒకే ఆకారములో ఉండినను ఇంకే పోలికా లేదు. కేవలము ఆకారము ఒకటైనంత మాత్రమున భూమండలము నారింజపండు అగునా? పోతనగారు అన్నట్లు మానస సరోవరంలో ఈదులాడే హంస చిన్న చిన్న కొలనుల కోసం ప్రయత్నిస్తుందా? ఎంతమాత్రము ప్రయత్నించదు. పరమేశ్వరుని మీద ప్రీతిగొన్న హృదయము ఇంకే విషయము మీద ప్రీతి గొనదు. ఇంక ఏ ఆనందము కోరదు. ఇది చెప్పింది ఆరేళ్ళ బాలుడు ప్రహ్లాదుడు. కావున ఈశ్వర ప్రాప్తికి కావలసినది వయస్సుకాదు. సంకల్పం, ఆసక్తి. అవి లేనినాడు బండరాతికి వయసు వచ్చినా, మనిషికి వయసు వచ్చినా ఒకటే.

అలాగని బాలురందరిని చదువు మానేసి, యువకులందరిని పెండ్లి మానేసి, ఉద్యోగము మానివేసి దైవ ధ్యానములో గడపమని కాదు, ఈ శ్లోకములోని అర్థము.

వృద్ధులై రోగగ్రస్తులు అయ్యాక అందరూ చేసేది ఆ దైవ ధ్యానమే. కాని దానివల్ల ఫలితము చాలా తక్కువ. ఆ భగవంతుని దయ ఎప్పుడు వస్తుందో తెలియదు. గజేంద్రునికి, 'ద్రౌపది'కి కూడా బాధ భరించిన తరువాతే ఆయన దయ సిద్ధించినది. ఎందుకని? వారు ఆర్తితో ఆయన కరుణ కోరారు. మోక్ష కాములు కాదు. ఇక ఆ భగవంతుని అర్థము అనగా డబ్బు కోరే వారి సంగతి ఎంత తక్కువ చెప్పితే అంత మంచిది. ఆ సంఖ్యకు అంతేలేదు. అందుకే ఏ వయస్సు పని ఆ వయస్సులో చేసుకుంటూనే మనస్సును దేవునివైపు త్రిప్పి ఈ సుఖ దు:ఖములు, గెలుపు ఓటములు అన్ని అనిత్యములని వృత్తాకారముగ ఒక దాని తరువాత ఒకటి వస్తూనే ఉంటాయని ఆ వచ్చేవి పురాకృత కర్మవల్ల వస్తాయని, తెలుసుకొని వాటి దారిన వాటిని అనుభవిస్తూనే మనస్సుని భగవంతునివైపు మళ్ళించాలి. కులాలు మానవ కల్పితాలు అందరూ భగవంతుని దృష్టిలో ఒక్కటే. ఆ సర్వాంతర్యామి ఒక్కడే.. ఆయనను నీ ఇష్టము వచ్చిన రూపంలో ధ్యానించు. జీవితము ఉన్నతంగా జీవించటానికి ప్రయత్నించు. జీవాత్మకు పరమాత్మకు బేధము



లేదు. సర్వాత్మలకు ప్రేరకుడు, పూజ్యుడు, పోషకుడు, గురుమూర్తి ఆ దక్షిణామూర్తి ఒక్కడే. ఇది తెలిసాక ఏ గురువు అవసరం ఏ మాత్రం లేదు. అటువంటి యోగ పురుషుడికి అష్టసిద్ధులు ('అణిమ' అనగా అణుప్రాయం అవటం, 'మహిమ' అనగా అత్యధిక పరిమాణము పొందటం, 'గరిమ' అనగా విపరీతంగా బరువు పెంచగలగటం, 'లఘిమ' అనగా అతి తేలిక అయిపోవటం, 'ప్రాప్తి' అనగా ప్రపంచంలోని ఏ ప్రాంతమైనా చూడగలగటం, 'ప్రాకామ్యము' అనగా ఆకాశ గమనము, 'ఈశిత్వము' అనగా ప్రకృతిని అదుపాజ్ఞలలో ఉంచగలగటం, 'వశిత్వము' అనగా లోకులను వారి తీరును అదుపాజ్ఞలలో ఉంచగలగటం, అనబడునటువంటి అష్టసిద్ధులు) వాటంతట అవే కలుగుతాయి. ఒక్కసారి పరికించండి. షిర్డీ సాయిబాబా, సత్యసాయి బాబా వీరందరికి ఆ విపరీతమైన ఆకర్షణ ఎట్లా వచ్చింది? వారు ఏ సాధన చేసారు? ఏ తపస్సు చేసారు? వారికి కేవలం ఈ సర్వాత్మత్వము వల్లనే అష్ట సిద్ధులు అబ్బాయి. లేకున్నచో వారి వయస్సు ఎంత? వారు తపస్సు చేసిన కాలమెంత?



కులము, మతము, వయస్సులతో సంబంధం లేకుండా వారు అన్ని జీవులయందు కల ఆత్మ ఒక్కటే అనిగ్రహించుట వలన భగవంతుని ఆ ధ్యానముతో ఆరాధించుట వలన ఆ శక్తులు వాటంతట అవే వారికి కలిగాయి. వారు ఆ విధంగా శక్తులు ఉండికూడా లోక హితము కోరుచు భగవత్ ధ్యానం చేసారు. సాత్విక జీవనం, ఆహారము, విశ్వమానవ ప్రేమ ఇదే వారు లోకానికి అందించిన, అందిస్తున్న సందేశము.

ఇది

జగద్గురు శ్రీఆదిశంకరాచార్య

భగవత్పాదులు రచించిన

## శ్రీదక్షిణామూర్తి స్తవము

సర్వేజనా సుఖినోభవంతు



## అంకితము

సీ॥ బిడ్డవద్దను స్త్రీకి బిడ్డ నిత్తువుగాని
బిడ్డకేడ్చెడిదాన్కి బిడ్డనీవు
బ్రతుకు వద్దనువాన్కి బ్రతుకు నిత్తువుగాని
బ్రతుకుతాననువాని బ్రతుకనీవు
ధనము వద్దనుచోట ధనమునిత్తువుగాని
ధనముకావాలన్న ధనమునీవు
రోగమొద్దనివేడ రోగమిత్తువుగాని
సుఖము కావాలన్న సుఖమునీవు

తే॥ మాకు వలసినదానిని మాయచేసి
మాకు వలదను దానిని మాకె ఇచ్చు
నిన్ను పొగడగ నేనెంత నిటలనయన!
తిక్కశంకరా! సతితోడ దీని గొనుమ.